జిల్లాలో రైతులంతా ఒకే రకమైన పంట సాగు చేసే దొడ్డు రకం ఎక్కువగా సాగు చేస్తారు. అయితే, అం చేసే నియంత్రిత పద్ధతిని ఈ ఖరీఫ్ సీజన్ నుంచి

# కరోనాపై ర్యాండమ్ పోరు

- దేశ వ్యాప్తంగా ఐసీఎంఆర్ సర్వే
- కామారెడ్డి జిల్లాలో ఐదు గ్రామాల్లో పూర్తి
- నేడు మరో ఐదు గ్రామాల్లో నమూనాల సేకరణ
- సామాజిక వ్యాప్తిని గుర్తించేందుకే..



కామారెడ్డిలో వివరాలు సేకరిస్తున్న ఐసీఎంఆర్ ప్రతినిధులు, (ఇన్‌సెట్‌లో) శాంపిల్స్ సేకరణ

సాక్షి, కామారెడ్డి: కరోనా వైరస్ వ్యాప్తి ఏ మేరకు జరిగిందనే దానిపై భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ర్యాండమ్‌గా సీరం సర్వే చేపట్టింది. ఇందుకోసం జిల్లాలో ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లో శుక్రవారం రక్త నమూనాలు సేకరించారు. కరోనా సామాజిక వ్యాప్తి జరిగిందా.. లేదా? అన్నది గుర్తించేందుకు గాను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీఎంఆర్ దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 69 జిల్లాల్లో ఈ సర్వే నిర్వహిస్తోంది. ఇందుకోసం తెలంగాణలో మూడు జిల్లాలను ఎంపిక చేయగా, అందులో కామారెడ్డి ఒకటి. ఐసీఎంఆర్ ప్రతినిధి డాక్టర్ దినేశ్ ఆధ్వర్యంలో ఐదు బృందాలు శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన అధికారులు, సిబ్బందితో కలిసి ముందుగా నిర్ణయించిన ప్రకారం ఐదు క్లస్టర్లలో రక్త నమూనాల సేకరణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని నాలుగో వార్డులో, రాజంపేట మండలంలోని తలమడ్ల, తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్, మాచారెడ్డి మండలంలోని భవానీపేట, ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూరు గ్రామాల్లో శుక్రవారం ఈ సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాండమ్‌గా రక్త పూతలు సేకరించారు. ఒక్కో గ్రామంలో 40 మంది నుంచి నమూనాలు సేకరించి, వారి కేస్ స్టడీస్ రికార్డు చేశారు. సేకరించిన రక్త నమూనాలను చెన్నైలోని ల్యాబ్‌కు పంపిస్తున్నట్టు వైద్యులు తెలిపారు.

### నేడు మరో ఐదు గ్రామాల్లో..

ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన సీరం సర్వే నేడు (శనివారం) జిల్లాలో మరో ఐదు గ్రామాల్లో కొనసాగనుంది. పిట్లం మండలం ధర్మారం, గాంధారి మండలం నేరల్, నాగిరెడ్డిపేట మండలం ధర్మారం, జుక్కల్ మండలం చిన్న ఎడ్గి, బిచ్కుంద మండలం పెద్దకొడప్‌గల్ గ్రామాల్లో రక్త నమూనాలను సేకరించనున్నారు. ఒక్కో గ్రామంలో 40 మంది రక్త నమూనాలు సేకరించనున్నారు.

### దేశ వ్యాప్తంగా సర్వే..

ఇప్పటివరకు కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తుల ప్రైమరీ, సెకండరీ కాంటాక్ట్ అయిన వారికి మాత్రమే పరీక్షలు జరిపారు. అయితే, కరోనా వ్యాప్తి ప్రైమరీ, సెకండరీ కాంటాక్ట్స్‌లకే కాకుండా సామాజిక వ్యాప్తి జరిగిందా.. లేదా? అన్నది గుర్తించేందుకే ఈ సర్వే చేపట్టారు. ర్యాండమ్‌గా చేపట్టిన సర్వే ద్వారా వైరస్ ఏ మేరకు వ్యాప్తి చెందిందన్న దానిపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంటుంది. ఒక్కో జిల్లాలో 400 మంది నుంచి రక్త నమూనాలు సేకరిస్తారు. దేశ వ్యాప్తంగా 69 జిల్లాల్లో ఈ సర్వే ద్వారా 27,600 మందిని పరీక్షించిన అనంతరం అందరి రిపోర్టులను క్రోడీకరించి కరోనా సామాజిక వ్యాప్తి ఏ మేరకు జరిగింది.. దాని నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఐసీఎంఆర్ ప్రతినిధులు తెలిపారు.

### జిల్లాలో పరిస్థితి అదుపులో..

కరోనా 12 పాజిటివ్ కేసులు నమోదు కాగా, వారంతా పూర్తిగా కోలుకుని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. కొత్త కేసులేవీ నమోదు కాలేదు. దీంతో కరోనా ఫ్రీ జిల్లాగా గుర్తింపు పొందింది. అయితే, ఇతర రాష్ట్రాల నుంచి వలస జీవులు సొంతూళ్లకు వస్తుండడంతో కొంత ఆందోళన నెలకొంది. వచ్చిన వారిని వచ్చినట్టు హోం క్వారంటైన్‌లో ఉంచుతున్నారు. వారు బయట తిరగకుండా కట్టడి చేస్తున్నారు. వారిపై సామాజిక నిఘా ఉంచారు.

## తొలిరోజు 200 శాంపిల్స్ సేకరణ



కామారెడ్డి టౌన్/మాచారెడ్డి/తాడ్వాయి/రాజంపేట, ఎల్లారెడ్డి రూరల్: భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ప్రతినిధులు శుక్రవారం జిల్లాలో పర్యటించారు. కామారెడ్డి, మాచారెడ్డి, రాజంపేట, తాడ్వాయి, ఎల్లారెడ్డి మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో రక్త నమూనాలు సేకరించారు. ఒక్కో గ్రామంలో నాలుగు ప్రాంతాలు(తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం)గా విభజించి, ఆయా ప్రాంతాల్లోని యువకులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇలా మొత్తం 40 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఐదు గ్రామాల్లో కలిపి తొలి రోజు 200 శాంపిల్స్ సేకరించారు. ఐసీఎంఆర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రాంతాలలో ర్యాపిడ్ పరీక్షల కోసం రక్త నమూనాలు సేకరించామని ఎన్ఐఎన్ జిల్లా కో–ఆర్డినేటర్ దినేశ్ తెలిపారు. డబ్ల్యూహెచ్‌వో జిల్లా కో–ఆర్డినేటర్ స్నేహాశుక్ర పర్యవేక్షించారు. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, నోడల్ అధికారి సాహెద్‌అలీ, ఐసీఎంఆర్ ప్రతినిధులు అరుణ్, సురేఖ, టెక్నికల్ అధికారి పీవీ సోను, సీనియర్ టెక్నీషియన్ విజయలక్ష్మి, ఆయా మండలాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి Sat, 16 May 2020
https://epaper.sakshi.com/c/51934203